

# నిష్కామ కర్మ

లోకంలో అనేక రకాలైన దేశాలున్నాయి. ఒక్కొక్క దేశంలో అనేక పట్టణాలున్నాయి. ఒక్కొక్క పట్టణంలో అనేక రకాల మనుషులుంటారు. ఒక్కొక మనిషిలో ఒక్కొక్క విధమైన మనస్తత్వమూ, అనేకరకాలైన భావాలూ వుంటాయి. ఈ వివిధమైన వైవిధ్యాన్ని చూసి మనం ఒక్కొక్కసారి నవ్వుకుంటూ వుంటాము. అబ్బో అనంతమైంది యీ ప్రజావాహిని అని అనుకుంటాము కామా?

అదొక పట్టణం. హిందూదేశంలోని పట్టణం. అవి తప్పిస్తే, ఆ పట్టణాన్ని గురించి ఎక్కువగా ఏమీ రాయనక్కరలేదు. అన్ని పట్టణాల లాంటిదే అదీను. పైగా అందరూ ఆ పట్టణాన్ని ఎరిగే వుంటారు. అందులో శివాలయం ఒకటుంది. ఆ శివాలయంలో ఒకానొక పర్వదినం నాడు ఒక స్వామిజీ ఉపన్యాసం యివ్వడానికి వచ్చాడు. భక్త సంఘం సెక్రెటరీ, ఆయన మాట్లాడే విషయాల్ని గురించి పేపర్లు అచ్చు వేయించి వూరంతా పంచిపెట్టాడు.

అల్లాంటి కరపత్రం ఒకటి రోడ్డంట నడిచే శ్రీకంఠం చేతిలో వచ్చిపడింది. అసలు వాడే చిత్రమైన వాడు. అల్లాంటి వాడిచేతిలో మరీ విచిత్రంగా వచ్చిపడ్డది ఆకరపత్రం. అది చదువుకుంటూ నడుస్తున్నాడు శ్రీకంఠం. వాడికి స్వామీజీకోసం రోడ్డు కడ్డంగా కట్టిన స్వాగతం బోర్డు కనిపించింది. దానికేసి బాగా పరకాయించి చూశాడు. చాలాబిరుదులు కనిపించాయి. అయితే, ఏ నాస్తికునికో వచ్చినట్లు, శ్రీకంఠం మనస్సులో పాడాలోచనలేవీ రాలేదు. భగవంతుణ్ణి గురించి తెలిసిన గొప్పవాడెవడో, అనుకున్నాడు వాడు.

తను తెలిసికోవలసిన విషయాలూ, తీర్చుకోవలసిన అనుమానాలూ, ఏమైనా వున్నాయేమోనని మనస్సంతా గాలించాడు. కాని, వేదాంతంలో ప్రవేశం లేనివాడికి, దేముడూ, భక్తీ, పారవశ్యమూ అనే వివిధ విషయాలమీద అనుమానాలెలా కలుగుతాయి? వేదాంతంలో కొంత గాకపోతే కొంతైనా ప్రవేశం వుండి, గుణింతాలూ, ద్విత్వాక్షరాలూ దిద్దిన వాడైతే ఎన్నో అనుమానాలలో పీకొక్కవచ్చు. అల్లా పీకొక్కడానికి అవకాశాలున్నాయి.

కాని శ్రీకంఠానికేమీ అనుమానాలు లేవు. కారణం వాడికి వేదాంతంలో ఆ,ఆ లేనివాడు. అల్లాగని వాడు దేముణ్ని గురించి వినకపోలేదు. దేముడు వున్నాడూ, లేడూ అని వాదించుకుంటూ జీవితాలు జీవితాల్ని ఎగరగొట్టేసుకున్న వాళ్ళని వాడు ఎరుగును. అయితే వాడికిమాత్రం దేముడున్నాడో లేడో తెలీదు.

ఆమాట అటుంచి, శ్రీకంఠం ప్రపంచంతో సంబంధం లేనివాడు. ఎన్నో జీవిత సమస్యల్లో, ప్రపంచంతో కలవకుండా, వాడొకటవాడు ప్రత్యేకమైన మార్గాన్ని అన్వేషించినవాడు. బ్రతుకుతెరువుకోసం ఒకాయి వాడిదగ్గర వుద్యోగం చేయనివాడు. తిండానికి యింత ఉన్నవాడు. కాని వాడికి మనసులోవున్న ఆలోచన ఏమిటో

చింతా శ్రీరామచంద్రమూర్తి

తెలియదుకాని, పెళ్ళిమాత్రం చేసుకోలేదు. అల్లా గని రంకుతనం మానలేదు.

అల్లాంటి శ్రీకంఠానికి వూళ్లో మంచిపేరూ, చెడ్డపేరూకూడా వున్నాయి. డబ్బువిషయంలో మంచిపేరు. ఎవ్వరికేనా యివ్వవలసివుంటే ఎగ వెయ్యడు. పుచ్చుకోవలసివుంటే మానడు. అందు కనే మంచిపేరు. కాని పెళ్ళిచేసుకుని చక్కగా కాపరం ఎందుకు చేసుకోడూ అన్నప్రజావాక్యం వాడికి చెడ్డపేరుని ప్రసాదించింది.

అల్లాంటి శ్రీకంఠం, సాయంత్రం స్వామీజీ చెప్పబోయే ఉపన్యాసాన్ని వినడానికి తీర్మా నించుకున్నాడు. దీనికి కారణంవుంది. ప్రస్తుతః వాడికి యీలోకంలో నచ్చనివి చాలావున్నయి. ఆ మీమాంసల్లో జీవితానికి ఏమైనా కొత్త విష యాలు వినపడతాయేమోనని వాడు అను కున్నాడు.

* * *

సాయంత్రం అయింది. ఆలయంలోకి పురజను లందరూ వస్తున్నారు. వారిలో శ్రీకంఠం కూడా వున్నాడు. అప్పటి కప్పుడే గుడి, జనంతో కిట కిటలాడుతోంది. భక్తసంఘం శెక్రెటరీ ప్రక్కను నడుస్తూ వుండగా స్వామిజీ ఆలయ ప్రవేశం చేసి దక్షిణ దిక్కుగా కళ్లని పోనిచ్చాడు. అలా చెయ్యడానికి కారణం వుంది. ఆ వైపే ఎన్నో చీరలు కూచున్నాయి. అయితే స్వామీజీ తీరని కోర్కెలు మనసులో వుండడంవల్ల అల్లా చూడ డానికి కారణమైందని మనం చెప్పలేం మరి ఎందుకు చూశాడో అన్నది భక్తుల కొక్కరికే తెలుసు!

శెక్రెటరీ స్వామీజీ మెడలో పూలహారం వేస్తూ, ఆయన్ని సభ్యులకు పరిచయం చేశాడు. స్వామీజీ గళద్వారంనుంచి మాటలు పాటంతట అవే వూరిపోయాయి. శ్రీకంఠం జాగ్రత్తగా విన డము ప్రారంభించాడు.

'భక్తులారా, నేడు సుదినం. ఇంతమంది భగ వద్భక్తుల ఎదుట నేను కొన్ని సంగతులు చెప్ప డానికి నోచుకున్నాను. అయితే ముఖ్యంగా భగ వంతుణ్ణి చేరడానికి వున్న మార్గాలేమిటో, వాటిని గురించి మన మతం ఏమని చెపుతూ వున్నదో, మొదలైన విషయాలు మనమంతా నేర్చుకోవాలి.'

ఆగాడు స్వామీజీ. ముందు వరసలో కూర్చున్న వృద్ధ వితంతువులు కొందరూ, పించనీ దార్లు కొందరూ ధన్యోస్మి ధన్యోస్మి అన్నారు.

'భారతదేశం చాలాగొప్పదేశం. ఈ పుణ్య క్షేత్రంలో చాలావుంది యోగులూ, యోగినిలూ పుట్టారు. వ్యాసుడు, వాల్మీకి, పతంజలి, మనువు, ఆపస్తంభుడు మొదలైనవారంతా జాతి సముద్ధ రణకై పనిచేసిన ఋషులు. అయితే వారంతా పూర్వయుగంవాళ్లు. ఇప్పుడు వాళ్లల్లో బ్రతికున్న వాడొక్కడూ లేడు. అయితే ఏం, వాళ్లు ఆయా స్వరూపాల్లో యథాతథంగా లేకపోయినా, వాళ్ల ఆత్మలు మన దగ్గరే వున్నాయి. వాళ్ళ అనుయాయుల్ని గురించి అప్పుడప్పుడు మనం వింటూవుంటాము. రామకృష్ణ పరమహంస, వివేకానంద వీళ్లంతా ఎవరనుకున్నారు. అల్లాంటి వాళ్లే.'

భక్తుల్లో కొందరు, స్వామీజీకూడా అల్లాంటి శ్రేణికి చెందినవాడే సుమండీ, అని పక్కవాళ్ళ చెవుల్లో ఊదుతున్నారు.

'అల్లాంటివాళ్ళంతా దేనికి కృషి చేశారో తెలుసా! భగవంతుడెవరో తెలుసుకోడానికి, తెలుసుకుని ఆ పరమాత్మలో ఐక్యమైపోడానికి. అల్లా లీనమైపోకలిగిననాడు యీ జనన మరణ చక్రం అంతటితో ఆగిపోతుంది. ఈ సంసా రమూ, పిల్లలూ, కటుంబ ఆదాయ వ్యయాలూ, జమాఖర్చులూ ఏమీ వుండవు. అందుకని మీ రంతా ఆపరమాత్మలో లీనమవడానికి ప్రయత్నం చెయ్యాలి. అలా చేస్తారని నమ్ముతున్నాను.

భక్తుల్లో కొందరు ఎందుకు చెయ్యమూ అన్నట్లు చూస్తూ, తలలు తాటికాయల్లా వూపు తున్నారు.

'అయితే భగవంతుణ్ణి చేరడానికి ముఖ్యమైన మూడు మార్గాలున్నాయి. ఒకటి భక్తిమార్గం, రెండు జ్ఞానమార్గం, మూడు వైరాగ్య మార్గం. ఇందులో ఒక్కొక్కటి ఒక్కొక్కమెట్టు అని అనుకుంటే, చివరకు వైరాగ్యసోపానం మీదికి భగవంతుడనేవాడు చేతికి అందుతాడు. వీటిని గురించి వివేకానంద చాలా చెప్పాడు. అవన్నీ మీరు చదవాలి. చదువుతారని ఆశిస్తాను.'

అవన్నీ చదివే ఓపిక ఎవరికుంటుంది. అందు కని మీరు ఆచరణలో పెట్టిన హంశాల్ని

గురించి సెలవిస్తే బాగుంటుందని గొణుక్కుంటున్నాడు ఒక ముసలాయన.

'నేను వరాసరి స్వవిషయం దగ్గరికి చేరుకున్నాను. ముందు కర్మయోగంలో కలిసిపోయి, రాంభజనలు చేసాను. తర్వాత భక్తి బాగా కుదిరిన తర్వాత జ్ఞాననేత్రం దానంతట అదే తెరుచుకుంది. అందులోంచి చూశాటప్పటికి అన్ని ప్రాణులూ వకజేనని తెలిసిపోయింది. స్త్రీ, పురుషునికంటె ఏమంత గొప్పది కాదు అన్న తత్వం గ్రహించడంవల్ల వివాహం కట్టిపెట్టాను. ఇప్పుడు వైరాగ్యదశలో వున్నాను.

అందుకనే స్వామీజీ కాషాయగుడ్డలు కట్టి యింతటి యోగిపుంగవు డయ్యాడు. స్త్రీలు కుళ్ళితులు. కామాన్ని రేపుతారు. పిల్లల్ని కంటారు. వాళ్ళని పోషించమని మగాడికి అప్పగిస్తారు——అనుకుంటున్నారు కొందరు రెండో పెళ్ళివాళ్ళూ, డబ్బులేని బీదవాళ్ళూను.

స్వామీజీ కంఠం అంతటితో ఆగలేదు. గొట్టాంమాదిరిగా మోగుతూనేవుంది. ఈ మాటలన్నీ వింటూనేవున్నాడు శ్రీకంఠం. అయితే వాడి మనస్సులో భగవంతుడితో ఐక్యమైపోవడమనే హాంశం అట్టే హత్తుకుపోలేదు. లేచి పోదామా అనుకుంటున్నాడు వాడు.

ఇంతలో సభమధ్యలోంచి, ఒక డబ్బున్న మనిషి లేచాడు. అందరూ నిశ్శబ్దం వహించారు. కళ్ళన్నీ ఆయనమీద కేంద్రీకరింపబడ్డాయి. ఆయన బయటకు వెళ్ళడానికై లేచాడనుకున్నాడు సెక్రెటరీ.

'అప్పుడేవెళ్ళిపోతారా. అన్నాడు సెక్రెటరీ.

'ఒక చిన్న ప్రశ్న! అందుకని లేచానన్నాడు' డబ్బున్న మనిషి.

'స్వామీజీకో మనవి చెయ్యండి' అన్నాడు సెక్రెటరీ.

స్వామీజీ డబ్బున్న మనిషివైపు తిరిగి చిరునవ్వునవ్వాడు. ఏమిటో సెలవియ్యండి అన్నట్టు చూస్తూ.

'నిష్కామకర్మ అంటూవుంటారు. దాన్ని గురించి సవిస్తరంగా మనవి చెయ్యాలి' అంటూ డబ్బున్న మనిషి కూచున్నాడు దక్షిణదిక్కుగా చూస్తూ. ఆయన స్థిమితపడ్డాక స్వామీజీ ప్రారంభించాడు.

'సభ్యుల్లో ఒకరు- చాలా భక్తిపరులు- ఒక చక్కటి ప్రశ్న వేశారు: నిష్కామకర్మ అంటే ఏమిటీ అని? కర్మసిద్ధాంతాన్ని చెప్పాక, నేనే నిష్కామాన్ని గురించి చెపుదా మనుకుంటున్నాను. కాని ఆయనలో భగవంతుడు చైతన్యాన్ని కలగచేశాడు. ఆయన లేచి యీప్రశ్న వేశాడు.'

'చెపుతాను వినండి. నిష్కామం అంటే కామం లేకపోవడం. కామం అంటే కోరిక. కోరిక అంటే పాపిష్టి తలంపు. దీనికే వ్యసనమని యింకోమాటుంది. వ్యసన మంటే ప్రతిఫలాన్ని కోరేది అని అర్థం. అంతేకాకుండా అహంభావాన్నీ, అహంకారాన్నీ పెంపుచేసేది అనికూడా అర్థం చెప్పుకోవచ్చు. అల్లాంటి ప్రతిఫలాన్ని దేనినీ వాంఛించకుండా చేసే కర్మని నిష్కామకర్మ అంటారు.

'ఇల్లా చెప్పినంతమాత్రాన కూడా మీకు సరిగ్గా బోధపడి వుండదు. ఉదహారణలు చెప్పుకుందాం.'

ఒకవూళ్ళో ఒక ధనవంతుడున్నాడు. ఆయన పెద్దపండుగనాడు వూళ్లో వున్న బీదలందరికీ పంచెలూ, తువ్వాళ్లూ, చొక్కాగుడ్డలూ, పంచిపెట్టాడు. ఆడబ్బు తిన్న బీదలందరూ, మాకు వోర్గినే ఎందుకు యివ్వడం? ఏవైనా పనులు చేయించుకోండి అన్నారు. 'ఇందుకేనా మీకు దానంచేసింది! ప్రతిఫలాపేక్ష లేకుండాచేశాను. మీరు నన్ను ప్రేమతో చూస్తే చాలంనన్నాడు ధనవంతుడు. ఇదే నిష్కామ కర్మ.

ఇంతకంటె చక్కనైన విషయం చెప్తాను, వినండి. అవూళ్ళోనే ఒకాయన కాంగ్రెసులో పనిచేసిన మనిషి వున్నాడు. ఆయనకు ప్రభుత్వం కొంత పొలాన్ని గ్రాంటుగా యివ్వబోయినారు. 'ఇందుకేనా నేనుదేశానికి సేవచేసింది'అన్నాడు. ఇది కూడా నిష్కామకర్మే.

'ఆ విధంగానే భగవంతుని విషయంలోనూ వూహించుకోవచ్చు. భగవంతుణ్ణి ఏ కోరికా కోరకుండా వుంటూనే కూడా, భక్తితో పూజలు చెయ్యవచ్చు. నేనింత గొట్ట పూజ చేసాను, కనక, కనీసం నాకో కాసు బంగారమేనా యివ్వండి దేమునుగారూ, అని అడక్కూడదని దానిభావం. దానినే నిష్కామ

కర్మ అంటారు. అయితే దీనిలో సూక్ష్మార్థం ఒకటుంది. లోకంలో ఏపని చేసినా, అది నేననే అహంకారంతో చెయ్యకుండా వున్నట్టయితే మానసిక విశ్రాంతి కలుగుతుంది. వైరాగ్యభావనలో అదికూడా ఒక మెట్టు అల్లా భావించకలిగిననాడు లోకం నీకేసి అసూయతో మాడనే చూడదు' స్వామీజీ ఆగాడు.

చప్పట్లు మోగిపోయాయి. నిష్కామం ఎంత గొప్పదని అనుకుంటున్నారో సభ్యులందరూ. నేను నిష్కామినంటే నేను నిష్కామినని కొట్లాడుకున్నారు వయోవృద్ధులందరూ. సెక్రెటరీ పాలగ్లాసు స్వామిజీ నోటి కందించాడు. స్వామీజీ నిష్కామంగా పుచ్చుకుని త్రేపుమని తేన్చాడు. సెక్రెటరీ ఏం చెప్పాడో తెలీదు గాని, స్వామీజీ ఆనాటికి తుది పలుకులు పలికేశాడు.

పాప లోకం నించి, పుణ్యలోకంలోకి టిక్కెట్టు లేకుండా, ఉచితంగా ప్రయాణం చేసే మహావీరుల్లాగ నిశ్శబ్దంగా పురజనులందరూ బయటకు అడుగువేశారు.

శ్రీకంఠం వాళ్ళందర్నీ ఎరుగున్నవాడే ఈ ఈ నిష్కాములందరూ ప్రజల్ని ఎల్లా పీడిస్తారో వాడికి తెలియందికాదు. అందులోనూ, నిష్కామాన్ని గురించి ప్రశ్న వేసిన దబ్బున్న మనిషి మరీ గొప్ప నిష్కామి. ఎవడికేనా ఒకకాణీ దానం చేస్తే వాడి రక్తాన్ని ఒకగంట పీలుస్తాడు. ఓ రూపాయి కూలిచ్చి రెండురోజుల పని ఒక్క రోజులో పూర్తి చేయించుకుంటాడు. ఆ విషయం మాట అల్లావుంచి స్వామీజీ చెప్పిన యిద్దరు వ్యక్తులూకూడా అల్లా ప్రవర్తించడానికి కారణముందని శ్రీకంఠానికి తట్టింది. వాళ్ళిద్దరూ ఒకేవూరువాళ్ళు గనక, తప్పకుండా వచ్చే ఎలెక్షన్ల కది నాందీ ప్రస్తావనలని వాడిట్టే గ్రహించేశాడు. గ్రాంటుల్ని వద్దన్న కాంగ్రెసువాడెక్కడున్నాడిప్పుడు!

అయితే ఏం, వాళ్ళందరి గొడవా నాకెందుకనుకున్నాడు శ్రీకంఠం. వాడి మనస్సులో ఏదో కోరిక రెపరెప లాడింది.

అసలు వేదాంతంలో అక్షర జ్ఞానమేనా లేనివాడికి సందేహం కలగడం చాలా విచిత్రం. అయితే యీ లోకంలో చాలా అనుభవించి వున్నాడు. ఇది నేను చేస్తున్నానూ అని వాడేదైనా పని చేసిననాడు, లోకమంతా వాడి కళ్ళల్లోకి చూసి, వీడు శ్రీకంఠంరోయి అని ఎగతాళిచేసి ఎత్తి పొడవడం మాట వాడు మరచిపోలేదు అది వాడి కష్టంలోని పని. వాడు వాంఛించేదేమిటంటే లోకానికి తెలియకుండా జీవించాలి అని. అంచేతనే యీ నిష్కామం అన్నమాట వాడ్ని చప్పుని ఆకర్షించింది.

అదేమిటో తెలుసుకోడానికని స్వామీజీ దగ్గరగా జేరుకున్నాడు శ్రీకంఠం. స్వామీజీ వూహించినట్టుగా శ్రీకంఠం దణ్ణం పెట్టలేదు. పోగా బిక్షకేనా పిలవలేదు కనీసం తాంబూలంలో పెట్టి అరటిపండేనా యివ్వలేదు వాడు చేసిన పనల్లా ఏమిటంటే ప్రశ్న వెయ్యడం.

'నిష్కామకర్మ అన్న భావాన్ని నిత్యజీవిత సమస్యల్లో, అమలులో పెట్టవచ్చునా?' అన్నాడు శ్రీకంఠం.

'అంటే మీ అభిప్రాయం.'

'తిండి విషయంలోనూ, భార్యతో కాపురం విషయంలోనూ, పిల్లల్ని కనడం విషయంలోనూ- మిగిలిన అన్నింటిలోనూ.'

'అసలు అదే యీ లోకంలో కావల్సింది. సంసారాన్ని ముట్టీ ముట్టకుండా, తామరాకులో నీటిలాగా వుండడమే వాంఛనీయం; అయితే మీ పేరు.'

'ఏదో అనామకుణ్ణి, శ్రీకంఠం అంటారు అందరూ.'

సెలవు తీసుకుని శ్రీకంఠం యిల్లు చేరుకున్నాడు. ఇంటికి చేరుకుని ఎంతగానో ఆలోచించాడు స్వామీజీ చెప్పిన విషయాన్ని గురించి అబ్బో ఎంత గొప్పదో నిష్కామ కర్మ! తామరాకుమీద నీటి చుక్కలాగ!

* * *

అయితే శ్రీకంఠమూ, స్వామీజీ. మాట్లాడుకునేటప్పుడు అదృష్టవశాత్తూ అక్కడ ఎవరూ లేకపోవడం కటస్థించింది కాని, లేకపోతే వీడికేమిటి పెళ్ళామేమిటి అని అనుకోకమానరు. కాని స్వామీజీమట్టుకు బుట్టలోపడ్డాడు. శ్రీకంఠం సంసారంతో బాధపడుతున్నట్టే అనుకున్నాడు. పాపం వెర్రివాడు. లోకంలో అంతా తన శిష్యులనే భావిస్తాడు స్వామీజీ.

కొన్నిరోజులికి స్వామీజీ గ్రామంనించి తరలి వెళ్లిపోయారు. కాని శ్రీకంఠం మనస్సులో ఆయన చెప్పిన నిష్కామకర్మ మెదలుతోంది. దీన్ని సాధ్యమైనంత త్వరలో అమలులో పెట్టెయ్యాలనుకున్నాడు. అప్పుడే శ్రీకంఠానికి ఎన్నో అనుభవాలు కలిగినయి.

ప్రపంచాన్ని నిష్కామంగా చూస్తూ, ఏం చేస్తుందో అని చెప్పి వాడు మధురవాణి ఇంటికి వెళ్ళడం మానుకున్నాడు. మధురవాణి అంటే కంగారుపడేరు గనుకను, శ్రీకంఠం వుంచుకున్నది. అదికూడా వీడికోసం ఒకరోజు, రెండు రోజులు, మూడురోజులు చూసింది. వాడు రాలేదు. అందుకని సంగతేమిటో తెలుసుకుని రమ్మని దాసీ మనిషిని పంపింది. అది సరుగా శ్రీకంఠం దగ్గరకొచ్చి, మిమ్మల్ని అమ్మగారు రమ్మన్నారని చెప్పింది.

పడక్కుర్చీలో నిష్కామంగా కూర్చున్నాడు శ్రీకంఠం.

'మీ అమ్మగారికి ఏం కావాలి డబ్బులా అన్నాడు' వాడు.

'ఏమో నాకేం తెలుసును' అన్నది దాసీ మనిషి.

'అయితే వస్తున్నానుపద' అంటూ శ్రీకంఠం మధురవాణి యిల్లు చేరుకున్నాడు. మధురవాణి మగతగా కళ్లు మూసుకుని, వెల్లకిలా పరుండి, రెండు చేతుల్నీ దండిమీదకి వేళ్లాడేసింది. అల్లాంటి పరిస్థితుల్లో ఏం చేస్తాడో చూడకూడదనుకుని దాసీది పక్కగదిలోకి తొలిగిపోయింది.

కాని అది భయపడినట్టుగా వాడేమీ చెయ్యలేదు. జారినపమిట సవరించి, చేతిమీద వేలితో చిటిక వేశాడు. ఏమిటి కథ అన్నట్టు లేచి కూచుంది మధురవాణి.

'దయ తప్పింది. ఏమిటి రావడమే మానేశారు' అన్నది అది.

'దయా గియా అని పెద్ద పేర్లేమీ పెట్టక్కర్లేదు నాకు. నే నిప్పుడు నిష్కామిని' అన్నాడు శ్రీకంఠం.

'అంటే' అన్నది మధురవాణి.

'తామరాకుమీద నీటి చుక్కని. ప్రపంచానికి దూరంగా వుంటామని' అన్నాడు శ్రీకంఠం.

'అంటే' అన్నది మధురవాణి.

'నాకేమీ కోరికలు లేవు. కోరికల్నించి తప్పుకుంటున్నాను. నీకేమైనా అవసరం కలిగితే ఎప్పుడైనా సరే, నేనొచ్చి ఉపకారం చెయ్యడానికి సిద్ధం' అన్నాడు శ్రీకంఠం.

'మరో మాటల్లో చెప్పాలంటే నాకివ్వవలసింది ఎగవెయ్యడానికా సూత్రం' అన్నది మధురవాణి.

'నీ డబ్బెవడికి కావాలి, వెధవడబ్బు. తామరాకుమీద నీటి చుక్కని, ఇదిగో తీసుకో' అని దానిమీదకి మనీపర్సు విసిరేశాడు వాడు.

'అంత కోపమూ' అన్నది మధురవాణి.

'ఇంక ప్రార్థనలూ అవీ కట్టిపెట్టు. నేను నిష్కామిని. నీ కింకా యీ ప్రపంచంమీద వ్యామోహం పోలేదు. డబ్బు కావాలి నీకు! అందుకనే యింక యీపైన నీకూ నాకూ సాగదు' అన్నాడు శ్రీకంఠం.

అలా అనడమే కాదు. గిరుక్కున తిరిగి యింటికి వెళ్ళిపోయాడు వాడు. వెళ్లిపోయే వాడ్ని రమ్మని బతిమాలితే మాత్రం వస్తాడా; వాడికే బుద్ధి కుదిరి వాడే వస్తాడనుకుంది మధురవాణి.

అయితే మధురవాణి భావించినట్టుగా శ్రీకంఠం దానింటికి వెళ్ళలేదు. జీవితంలో తను అన్వేషించే ధర్మం అన్ని ధర్మాల్లోకీ అత్యుత్తమైనదని వాడు అభిప్రాయపడ్డాడు. నిష్కామంగా జీవించడమన్నది వాడి ఆశయమయింది. అంచేత, ఆ దృష్టితోటే లోకాన్నంతనీ చూడడం అలవాటు చేసుకున్నాడు.

ఎవరికేనా లేదన్న వాడికింత పెట్టడం విషయంలోగాని, తనకోసం ఏదైనా ఖర్చు చేసుకోడం విషయంలోగాని, వాడు అహంభావం లేని ప్రతిఫలాపేక్షతో చేయడం ప్రారంభించాడు. ఏదైనా విలవైన వస్తువు కొంటే దాని మీద తన పేరు వేయించడం మానుకున్నాడు. మాటవరసకి, లేదన్న బీద విద్యార్థి వస్తే వాడి పేరడక్కుండానే ఫీ అయిదిచ్చాడు. వాడు రసీదు రాయబోతూవుంటే, 'అల్లాగయితే నే నిచ్చేదే లేదు; నువ్వు పుచ్చుకునేదీ లేదు' అని విసుక్కుంటా వాడి బుర్రకి పట్టించాడు. వీడేదో విచిత్రంగా వున్నాడని అనుకుంటూ, ఆ ప్రతినిధి డబ్బు తీసుకుని వెళ్ళిపోయాడు.

ఈ విధంగానే శ్రీ కంఠం తనకు తెలుసున్నంతలో స్వామిజీ చెప్పిన విషయాన్ని అమలులో పెడుతూనే వచ్చాడు. దానివల్ల కలిగిన ఫలితాలుకూడా శ్రీ కంఠానికి తెలియక పోలేదు. లోకుల్లో శ్రీ కంఠం, శ్రీ కంఠం అనే ఉచ్చారణ సద్దుకుంది. అదే వాడు కోరుకున్నది.

అన్నింటికంటే గమనించవలసిం దేమంటే, ప్రతి ఫలాపేక్షలేని మనుష్యులైతే ఎన్నెన్నో సందర్భాల్లో యీ వేదాంత సూత్రాల్ని అమలులో పెట్టగలరు కాని, స్త్రీ విషయంలో పెట్ట లేరు. శ్రీ కంఠంమాత్రం స్త్రీ విషయంలోకూడా అమలులో పెట్టాడు.

ప్రతి ఫలాపేక్షతో, అంటే డబ్బుకోసం తన దగ్గరకువచ్చి నగ్నంగా నిలబడే యీ మధుర వాణులూ, రంగసానులూ వాడి మనస్సును ఇంక ఏమాత్రమూ ఆకర్షించ లేకపోయారు. పైగా వాళ్ళ అవసరమూ, ఆకర్షణా తన కెంత వున్నాయో, తన అవసరంకూడా వాళ్లకంతే వుంది; లేకపోతే సానుల దగ్గరకి మాత్రం అందరూ ధైర్యంగా వెడతారా అని వాడు గ్రహించాడు. ఈసందర్భంలోనే ఒకచోట వాడిభావన తు.చ. తప్పకుండా రైటయింది. వెంకటమ్మ అనే ఒక మనిషి వీడు కనపడకపోతే బెంగతో మంచం పట్టింది. ఈ విషయం తెలిసి వాడు బాగా ఆలోచించి, ప్రేమించడం కూడా ప్రతిఫలమే అని తీర్మానించుకున్నాడు. అలా ప్రేమలో యిరుక్కు పోయినట్టయితే 'నేను నిష్కాముని ఎలా అయ్యాను' అని ప్రశ్నించుకుని దానిదగ్గరకు సైతం వెళ్లడంమానుకున్నాడు. అంతే.

ఈ విధంగానే జీవిస్తూ, శ్రీ కంఠం సాధ్యమైనంతవరకూ స్త్రీలనించి దూరంగా జరిగిపోడానికి ప్రయత్నించాడు. అలాగని వాడు సన్యాసాన్ని స్వీకరించలేదు. మామూలు దుస్తుల్ని మాని కాషాయ గుడ్డల్ని కట్టనూలేదు. నిష్కామంగా జీవించడం అలవాటు చేసుకున్నాడు అంతే.

అలా నిష్కామంగా జీవించే శ్రీ కంఠానికి వాడిలో నిష్కామాన్ని అన్ని విధాలా అభివృద్ధి పరచినట్టుం యిక్కడే ప్రారంభమైంది.

శ్రీ కంఠం నివసించే యింట్లో పక్క వాటాలోకి ఒక సంసార కుటుంబం కాపురానికి వచ్చింది. వాళ్లెనా ఎక్కువమంది ఎవరూ లేరు. ఒక తల్లీ తండ్రీ, పదహారేళ్ల వయసున్న పార్వతి అనే అమ్మాయి ఒక త్తీను. తండ్రికి పూర్తి తిరిగే వుద్యోగం. అంచేత అతడు స్థానికంగా ఎన్నో రోజులు యింటిని అంటిపెట్టుకుని వుండడని అందరూ గ్రహించుకోవచ్చు. తల్లి ఎప్పుడూ, మత్తుగా జోగుతూ వుంటుంది. దీనికి తిండి ఎక్కువవడం, పనేమీ లేక పోవడం కారణాలు. వాళ్ళువచ్చి వాడింట్లో ప్రవేశించిన పది పన్నెండు రోజులవరకూ వాళ్లెవరోకూడా శ్రీ కంఠం గమనించ లేదు. కాని పార్వతి వీడికేసి చూస్తోనే వుంది. ఆ అమ్మాయి మెళ్లో మంగళ సూత్రం ఎవడూ కట్టలేదు. ఆ సంగతికూడా శ్రీ కంఠం గమనించ లేదు. కాని, వాడి నుదురుమీద పడే వుంగరాల జుట్టూ, విశాలమైన వక్షస్థలమూ, ఆ పిల్లని ఎందుకో కలత పెట్టాయి. వాడూ యింట్లో ఒంటరిగా వుండడం ఆమెకు చాలా ఆనందాన్ని కలిగించింది. ఒకరోజున ఆ అమ్మాయి తల్లి దొడ్లో నూతిదగ్గర బట్టలు గుంజుకుంటోంది. శ్రీ కంఠం అరుగుమీద గదిలో కూచున్నాడు. వాని కెదురుగా వున్న గదిలో పార్వతి ఒక్కత్తే వుంది. ఆ అమ్మాయి మనసులో ఏ కోరికలు లోంగి చూస్తున్నాయో తెలీదు. కన్ను సైగ చేస్తూ పమిటి కిందకి జారవేసింది.

ఆ పిల్ల అలా ధైర్యంగాచేస్తూ, శ్రీ కంఠం తప్పకుండా తనని మోహిస్తాడనుకుంది. కుర్చీ లోంచి లేచి తన దగ్గరకు వస్తాడనుకుంది. కనీసం నవ్వుతాడనుకుంది. కాని వాడేమీ చెయ్యలేదు. కారణం ఆటువంటి కామచేష్టలు వాడెరగనివి కావు.

'అయ్యో జంతువా' అనుకుంది ఆపిల్ల.

అయితే ఆ అమ్మాయి వాడి పక్కలో పడుక్కుందికి అట్టేకాలం పట్టలేదు. శ్రీ కంఠం దాని హృదయాన్ని లోతుకంటా తణిఖీ చేశాడు. అందులో ఎక్కడా కామేచ్ఛ కనపడలేదు. కామేచ్ఛ అంటే స్వామిజీ చెప్పినలాంటిది.

'ఈపని డబ్బుకోసమా' అన్నాడు శ్రీకంఠం.

'కాదు' అన్నది పార్వతి.

'బిడ్డలకోసమా' అన్నాడు శ్రీ కంఠం

'ఛా' అన్నది ఆపిల్ల.

'ప్రేమా' అన్నాడు శ్రీ కంఠం.

ఊం అనాల్ని అనుకుందిగాని, ఎక్కడ లేవ తీసుకుపోతాడో అని భయపడి ప్రేమ కాదన్నది.

'మరి ఏమీ కాకపోతే నేను నీకెందుకు' అన్నాడు శ్రీకంఠం.

'వయస్సులో వున్న స్త్రీని, నాకు వాంఛలు రేగినాయేగాని తీరలేదు. వాటి సంతృప్తికోసం అడుగుతున్నాను. దీనివల్ల మీకేమీ యిబ్బంది కలుగకూడదు. అలాగయితేనే నాకు సంతోషం.'

'ఒక్క విషయం ఆలోచించుకో. ప్రతిఫలాపేక్ష లేకుండా, నీతో వుండడానికి నా కభ్యంతర మేమీ లేదు. నా పేరు సయితం నువ్వు స్మరించవద్దు. నీ పేరు నా కనవసరం. కలిసినప్పుడెలా వున్నామో, విడిపోయేటప్పుడు కూడా అలాగే వుండాలి, తామరాకుమీద నీటి చుక్కలాగ, తెలిసిందా, అన్నాడు వాడు.

'సరే' అన్నది ఆపిల్ల.

ఆవిధంగా మూడు నెలలు శ్రీకంఠం పార్వతితో వున్నాడు. వాడు ఆ అమ్మాయిని ఏదో రక్షించడానికై పుట్టినవాడిలా ఏమీ అనుకోలేదు. ఎందుకో కలిసిం దనుకున్నాడు. ఆత్మే లేనివాడికి సంతృప్తి ఎక్కడుందని వెతకడం! ఏమైతేం, చివరకు వాళ్ళిద్దరూ విడిపోక తప్పింది కాదు. పార్వతి తండ్రికి మరో వూరు బదిలీ అయింది. విడిపోయేటప్పుడు, తనకోసం ఏడుస్తోందేమోనని, వాడు దాని కళ్ళల్లోకి చూశాడు. అది చాలా ఆనందంగా వుంది, మరే సమయంలోనూ కూడా అంత ఆనందంగా లేదు. అందుకనే శ్రీకంఠం దాని తత్వం అమూలాగ్రంగా అర్థం చేసుకున్నా ననడం.

'మనిషివంటే నువ్వే నే, ఉత్త నిష్కామిని' అనుకున్నాడు వాడు.

* * *

పార్వతి శ్రీకంఠం జీవితంలో అడుగు పెట్టడంవల్ల వాడు సంసార జీవితాన్ని రుచి మరిగాడని గానీ, అది వెళ్ళిన తర్వాత వాడు పేటలోకి వెళ్ళడం ప్రారంభించాడని గానీ మనమేమీ భావించనక్కరలేదు. వాడి అచంచల విశ్వాసాన్ని వంద మంది పార్వతులు వచ్చినా సడలించలేరు. కాని వాడనుకున్న దల్లా ఏమిటంటే, పార్వతి తనకంటె నిష్కామి అని!

కాలం జరుగుతోంది. ఇలా వుంటూండగానే శ్రీకంఠం జీవితంలో పెద్ద సమస్య ఏర్పడింది. అది వాడు ఎంతపీక్కున్నా విడింది కాదు. అదేమంటే పాతికేళ్ళున్న సకేసి ఒకామె వీడున్న పొరిగింటికి కాపురం వచ్చింది. ఆమె పేరు సుభద్రమ్మ. పార్వతిలా కాకుండా సుభద్రమ్మకి వెనకాల చరిత్ర వుంది.

సుభద్రమ్మకి పధ్నాలుగో ఏట పెళ్ళయింది. అప్పటికే అది ఎలిమెంటరీ స్కూలులో ఎనిమిదో తరగతి పూర్తి చేసుకుంది. పదహారోయేట కాపరానికి వెళ్ళింది. పద్దెనిమిదో ఏట భర్త చచ్చిపోయాడు. కాపురం చెయ్యకుండా వున్న ఆడదైతే, ఎవరైనా కట్టుకుందురు. కాని తీరా ఎంగిలిపడిందే. అందుకనే దాని తల్లిదండ్రులు దానికేసి చూడనే లేదు. పైగా నీకర్మ అని సంఘంలో వదిలేశారు.

కాని సుభద్రమ్మ చనిపోయిన మొగుడికోసం ఏడవకలిగినన్నాళ్ళూ ఏడ్చి, చివరకు ధైర్యం తెచ్చుకుని, ట్రెయినింగు పూర్తిచేసుకుంది. వెంటనే ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం వచ్చేటప్పటికి దానికి యిరవై ఒకటే ప్రవేశించింది. అంతవరకూ దానికి మొగుడితో తప్ప వేరే పై సంబంధాలు ఏమీ లేవు. నాలుగేళ్ళనుంచి, ఏ వూరు వెళ్ళినా, మగాళ్ళు దానికోసం తిరుగుతూనే వుండేవారు. కాని దానికల్లాంటి పని యిష్టం లేకపోయింది.

శ్రీకంఠం వున్న పక్కయింటికి వచ్చేవరకూ కూడా సుభద్రమ్మ మంచిదే. కాని అదేమిటో కాలం ఆమెకు గిలిగింతలు పెట్టింది. దానికంటికి శ్రీకంఠం నవమన్మధుడిలా కనపడ్డాడు. ఎల్లాగయినా వాడిని సంపాదించాలనుకున్నది అది.

ఒకరోజున శ్రీకంఠం వంటరిగా యింట్లో కూర్చున్నాడు. సుభద్రమ్మ యిల్లు కాళీగా వుందా అంటూ అక్కడికి వచ్చింది.

'ఆ వుందని' అన్నాడు వాడు.

సుభద్రమ్మ నవ్వుతూ 'ఎంతలో' అన్నది. పదిరూపాయలన్నాడు వాడు. రాత్రి వస్తాను అంటూ సుభద్రమ్మ వాడికి తన అందాన్ని చూపిస్తూ వెళ్ళిపోయింది. ఆనాటిరాత్రే సుభద్రమ్మ శ్రీకంఠం యింట్లో ప్రవేశించింది. రెండు రోజులు పోయాక, అది సరిగ్గా పార్వతి చేసి

నష్టే చేసింది. అయితే పార్వతికేనా భయపడ్డానికి అవకాశాలున్నాయిగాని, దీనికెవరున్నారు? అందుకని హృదయంవిప్పి 'నువ్వు నాకక్కర్లేవాలి' అంది.

శ్రీకంఠం వెయ్యవలసిన నాలుగు ప్రశ్నలూ వేశాడు.

'పిల్లల కోసమూ కాదు; డబ్బు కోసమూ కాదు; ఏడేళ్ల తరువాత మళ్లా పురుషసౌఖ్యం కోసం' అన్నది సుభద్రమ్మ.

'నమ్మవచ్చునా' అన్నాడు శ్రీకంఠం.

'ఇందులో నమ్మక పోవడానికేముంది? అంతా నిజం' అన్నది సుభద్రమ్మ.

అల్లా కలిసింది వాళ్ళిద్దరికీను. వాడితో సంబంధం ఏర్పడినప్పటి నుంచీ సుభద్రమ్మకి శ్రీకంఠం ప్రపంచం అంతటాకీ గొప్పవాడుగా కనుపిస్తున్నాడు. కారణం, వాడికి తనుయిచ్చిన లోకువకి మరొకడైతే గుప్పిట్లోపెట్టుకుని పీకి పిసికేవాడు! కాని తన వ్యక్తిత్వాన్ని వీడేమీ చంపలేదు. తోటిమనిషిగా ఎంచి గౌరవభావం చూపుతున్నాడు.

అల్లా రోజులు జరిగిపోతున్నాయి.

ఒకరోజు వెన్నెల ఎంతో చక్కగా ప్రపంచంమీద తెల్లగా పరుచుకునివుంది. శ్రీకంఠం పడకకుర్చీలో కూచుని ఆకాశంకేసి చూస్తున్నాడు. సుభద్రమ్మ మంచంమీద పడుకుని కూనిరాగాలు తీస్తోంది.

'నేను నిష్కామిసైన తర్వాత లోకంనాకేసి చూడడం మానేసింది. నిష్కామాన్ని గురించి నీకు తెలుసునా' అన్నాడు శ్రీకంఠం.

'అదేమిటో నాకు తెలియదు కాని, మిమ్మల్నింక జీవితంలో వదలిపెట్టలేనంతగా కామిస్తున్నాను నేను' అన్నది సుభద్రమ్మ.

ఈమాట లంటూంటే, సుభద్రమ్మ హృదయం పూవులా వికసించింది. కాని శ్రీకంఠం మాత్రం మొగ్గలా ముడుచుకుపోయాడు.

'అల్లాంటి మాటలు కట్టిపెట్టు' అన్నాడు శ్రీకంఠం.

'నే నేమన్నాననీ, నిన్ను వదలలే ననేగా' అన్నది సుభద్రమ్మ.

'నిష్కామంగా వుండమన్నాను; అప్పుడే మరచిపోయావా, నే నెక్కడకో పోతాను నేను, నావెంట పడతావేమిటి నువ్వు' అన్నాడు వాడు.

సుభద్రమ్మకి ఏమీ పాలుపోయింది కాదు. దెబ్బతిన్న పాములా వాడి కళ్లల్లోకి చూసింది.

'అల్లాగయితే యీ అకర్షణని ఆరికట్టకుంటావా, నీలో మంచితనం నన్నల్లా ఆకర్షించింది, తప్పులుంటే క్షమించు' అన్నది సుభద్రమ్మ.

ఈ మాటలకి శ్రీకంఠం ఏమీ చెప్పలేదు. కాని దాని మనస్సులో, వాడో భర్తకిందా, తనో భార్యకిందా అయిపోయి దైనిక జీవితంలో పేచీపడ్డట్టుగా గోచరించింది. అయితే ఏం, దాని మనస్సులో ఏముందో యీ నిష్కామికెల్లా తెలుస్తుంది?

* * *

అయిదు నెలలు జరిగాయి.

ఒకరోజున శ్రీకంఠం బజారుకుపోయాడు. లోకంలో అప్పుడే వాడ్నిగురించి గుసగుసలు బయలుదేరాయి. లోకంకేసి వాడు చూడకపోయినా, వాడికేసి లోకం చూడడం మొదలెట్టింది. అప్పటికప్పుడే గోడలమీద యీజీక్వల్జూలు ఏర్పడినాయి. శ్రీకంఠం యీజీక్వల్జూ పంతులమ్మ.

వాడి గుండెలో గునపం బడేసినట్టయింది. చర్రున యింటికి వచ్చేశాడు. ఈవిధంగా లోకం నోటిలో తనుపడ్డానికెవరూ కారణం? తప్పకుండా సుభద్రే అయివుంటుం దనుకున్నాడు. దాన్ని మింగెయ్యాలన్నంత కోపం వచ్చింది వాడికి. అపుకున్నాడు. లోకంనించి పేరునీ, ప్రఖ్యాతినీ వాంఛించకుండా, అసలు దానితో నిమిత్తమేమీ లేకుండా బ్రతికే తనని అప్పుడే లోకం అపహాస్యం చెయ్యడం ప్రారంభించింది.

'లోకంతో సంబంధం తెంపుకుని, తన ముద్రలు వేటినీ లేకుండా చెయ్యాలని వెళ్ళినే కట్టిపెట్టిన తనకి యిదా లోకం యిచ్చే గౌరవం' అని ప్రశ్నించుకున్నాడు వాడు. నిజం ,వాడు ప్రతిఫలాన్ని ఆశించకుండా ప్రతిఫలం యిచ్చే నిష్కామ కర్మయోగి. అల్లాంటివాడ్ని—ఛీ—వెధవప్రజ ఆడిపోసుకుంది. ఆడిపోసుకుంటోంది.

వాడు కోపాన్ని దిగమింగి రాత్రికోసం వేచివున్నాడు.

రాత్రి వచ్చింది. పడక్కుర్చీలో కూచున్నాడు శ్రీకంఠం. సుభద్రమ్మ భోజనంచేసి వాడి దగ్గరకు వచ్చింది.

'మీరు తండ్రిగావుంటే ఎంత గొప్పగా వుంటారు' అన్నది సుభద్రమ్మ.

'ఏమిటీ పేలుతున్నావ్, నా ముద్రలు లోకాని కనవసరం. అల్లాటికబుర్లెప్పుడూ చెప్పకు' అన్నాడు శ్రీకంఠం.

'నాలోని మాతృత్వాన్ని చంపుతారా' అని సిగ్గుతో తల వాల్చుకుంది. దాని మనస్సులో భావాలు గిరగిరా తిరిగాయి. కడుపులో ఏదో కదలివట్టయింది.

శ్రీకంఠం కధని పసిగట్టాడు.

'పద డాక్టరు దగ్గరకి పద, యిన్నాళ్లనించీ ఎందుకు దాచావు పద' అంటూ జడ పట్టుకున్నాడు.

'వదలండి వదలండి, కడుపుతో ఉన్న స్త్రీని యిల్లా బాధించకూడదు' అన్నది సుభద్రమ్మ.

ఆ ద దా న్ని బాధించకూడదనుకున్నాడో ఏమో శ్రీకంఠం దానిజడ వదిలేశాడు. శ్రీకంఠం దాని కళ్లలోకి తీక్షణంగా చూశాడు. వాడికి అందులో ఏం కనిపించిందో, ప్రశాంతంగా అయిపోయాడు వాడు.

'పార్వతిలాంటి దానవనుకున్నాను. కొంప ముంచేశావ్' అన్నాడు వాడు.

దానికళ్లు చైతన్యంతో విశాలమయ్యాయి.

'నాకూ దానికీ సాపత్యం తెచ్చారా? పార్వతికేం తెలుసు ప్రపంచం. పదహారేళ్ల పసిపిల్లఅది. దానిలో అప్పుడప్పుడే కొత్తగ స్త్రీత్వం రేకెత్తి తృప్తికోసం మిమ్మల్ని కామించింది. కాని నేనలాంటి దాన్నేనా? యవ్వనం మీద పడేటప్పుడే రెండేళ్లు కాపరంచేసి, పురుషస్పర్శ ఆమూలాగ్రం రుచిచూసినదానిని. నాలో ఎంతో అట్టడుగున మాతృత్వం పరిపూర్ణంగా వికసించి, బిడ్డకోసం ఎదురుచూస్తోందని ఎరుగుదురా? నేను తామరాకుమీద నీటిచుక్కలా వుండగలనా?' అన్నది అది.

దాని ఉపన్యాసం వాడ్ని కాలరుద్రుడ్ని చేసింది. పీకపట్టుకుని వీధిలోకి తీసుకొచ్చాడు. కాంపౌండులో వెన్నెల విరియబూస్తోంది.

'పో అవతలకి పో' అన్నాడు శ్రీకంఠం.

సు భ ద్ర మ్మ వాడి కళ్ళల్లోకి, నేను స్త్రీని అన్నట్లు చూసింది.

'మీరే తల్లీ తండ్రీని. నన్ను స్త్రీగా బ్రతకనియ్యరా?' అన్నది సుభద్రమ్మ.

దాని కళ్లల్లో అశ్రువులు జ్వలితమై వెలిగి, ఒక పెద్ద విషాదకావ్యంగా భూమ్మీద రాలినాయి. వాటిని చూశాడు శ్రీకంఠం. 'ఏమిటిదంతా' అనుకున్నాడు. తను నిష్కామంగా జీవిస్తూనేవున్నా, యీ లోకంమధ్య వున్నంతకాలం మిగిలిన ప్రజ తనని అల్లా బ్రతకనియ్యరా? తన తామరాకుకి ఆకర్షణ శక్తిలేక పోయినా, నీళ్లు తమ హృదయాన్ని దానికి అంకితం చేసి అదిమిపట్టుకుంటే? ఈ అంటుళ్ళు అంతా ఏమిటి? మెల్లిగా దానిని సమీపించి గెడ్డంకింద చెయ్యివేశాడు. భావావేగంతో దానివళ్ళంతా కాలుతున్నట్లు తోచింది. దానిగుండె నేనుస్త్రీని, నేను స్త్రీని అన్నట్లు కొట్టుకుంటున్నట్లు గమనించాడు. దాని కళ్ళల్లో వాడికి మాతృత్వం వికసించి పరిమళిస్తూన్నట్లు గోచరించింది. దాని బుగ్గమీద బుగ్గ ఆన్చి 'నీకే జయమైంది సుభద్రా' అన్నాడు వాడు.

సుభద్ర స్త్రీగా, సముద్రంలా గంభీరంగా నవ్వుకున్నది.

అయితే ఏం, వాడి మనస్సుకు శాంతి దొరకలేదు. మధుర వాణుల్నీ, వెంకటమ్మల్నీ దాటుకుంటూ, పార్వతి కౌగిలిలోంచి, సుభద్రమ్మ దగ్గరకువచ్చిన తన నిష్కామం ఏమైనట్టు? జీవిత మార్గంలో నడిచి నడిచి ఏ సత్యం దగ్గరకు చేరుకున్నట్టు? ఎంత ఆలోచించినా వాడికి ఏర్పడిన చిక్కులూ, సమస్యలూ విడలేదు. ఈసుభద్రమ్మ తన నెక్కడికి మోసుకు పోతోంది? యిదే వాడి ప్రశ్న. నిష్కామిగా లేచి నించుని స్వామీజీ చిరునామాకోసం భక్తసంఘం సెక్రెటరీ దగ్గరకు పరిగెట్టాడు ఆ అర్థరాత్రిని.